క్లుప్తంగా

సాంకేతిక విద్యపై అవగాహన



ఏలేశ్వరంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు అప్పన్నబాబు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అప్పన్నబాబు విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు వివిధ అంశాలపై మెళకువలు నేర్పారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

రౌతులపూడి: వార్షిక మరమ్మతుల కారణంగా స్థానిక 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లోను సోమవారం, మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జగ్గంపేట ఎలక్ట్రికల్ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

తాగునీటికి ఇబ్బంది

గండేపల్లి: నీలాద్రిరావుపేట గ్రామంలోని కొత్తపేటవాసులు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకు ద్వారా గ్రామస్తులకు తాగునీరు సరఫరా అవుతోంది. అయితే ఆ నీరు కొత్తపేటవాసులు సక్రమంగా అందకపోవడంతో ఒక ప్రైవేటు బోరు ద్వారా పంచాయతీ సిబ్బంది తాగునీటి సౌకర్యం కల్పించారు. అయితే అది కూడా పూర్తిస్థాయిలో అందకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. దగ్గరలో ఉండే వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొని వినియోగించుకుంటున్నారు. కిలో మీటరు మేర వెళ్లి బిందెలు, టిన్లతో నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని, వారం రోజులు అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని కొత్తపేటవాసులు వాపోతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కత్తిపూడిలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: మన చుట్టూ ఉంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించి, దోమల మందు పిచికారీ చేయించారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ఏఎస్‌డీ కళాశాలలో ఉచిత శిక్షణ

బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో డేటాఎంట్రీ, టైలరింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి ఆదివారం తెలిపారు. డేటా ఎంట్రీ కోర్సుకు ఇంటర్మీడియట్, టైలరింగ్ కోర్సుకు 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 6304731843 నంబరును సంప్రదించవచ్చన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ నిరంతర పరిశీలన

కాకినాడ సిటీ: జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదివారం కాకినాడ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి స్ట్రాంగ్ రూమును సందర్శించి పరిశీలించారు. అక్కడ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూముకు పటిష్ట భద్రత కల్పించామన్నారు. అదే విధంగా స్ట్రాంగ్ రూము వద్ద అన్ని వైపులా కనిపించేలా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘాను పరిశీలించడం జరుగుతుందని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

సారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: సారాను తయారు చేసినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్వామినాయుడు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సారాను తయారు చేయడం, విక్రయించినా ప్రజలు సహకరించి తమకు సమాచారాన్ని అందించాలన్నారు.ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల సూచనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు.

ప్రతి వారం సమస్యే..

- కోటనందూరులో ప్రతి గురువారం జరిగే సంతతో పెరుగుతున్న రద్దీ
- ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు
- నిలిచిపోతున్న ట్రాఫిక్
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



కోటనందూరు సంతలో నిలిచిపోయిన ట్రాఫిక్

కోటనందూరు: మండల కేంద్రం కోటనందూరులో ప్రతి గురువారం వారపుసంత జరుగుతుంది. ఈ సంతలో దుకాణాలను ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేస్తుండడంతో రాకపోకలకు స్థానికులతోపాటు వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకప్పుడు ప్రత్యేక ప్రాంతంలో నిర్వహించే ఈ సంత స్థానిక మార్కెట్ ప్రాంతం నుంచి ఎస్‌బీఐ బ్రాంచి వరకూ రోడ్డుకు ఇరువైపులా విస్తరిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ స్తంభించుకుపోతోంది. దీంతో గురువారం సాయంత్రం వచ్చిందంటే ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించుకుపోయి తీవ్ర అసహనానికి గురవుతున్నారు. వారం వారం జరిగే సంతతో పరిస్థితి ఇంత దయనీయంగా మారుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనజీవనానికి ఇబ్బంది లేని ప్రాంతానికి సంతను తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ సంగతి

కోటనందూరులో మార్కెట్ ప్రాంతం వద్ద గతంలో ఎవరికీ ఇబ్బంది లేని రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వారపు సంత నిర్వహించేవారు. మాంసపు, కూరగాయల దుకాణాలను వ్యాపారులు వేరువేరుగా ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకునేవారు. ప్రధాన రహదారికి సంబంధం లేకుండా నిర్వహించే ఈ సంతతో జనజీవనానికి ఏమాత్రం ఇబ్బంది ఉండేది కాదు. అయితే గత పంచాయతీ పాలకుల స్వార్థపూరిత ఆలోచన స్థానికులకు, వాహనచోదకులను అవస్థలు తెచ్చిపెట్టింది. సంత నిర్వహించే ప్రాంతాన్ని అడ్డగోలుగా విక్రయించేయడంతో సంత నిర్వహణకు సమస్యలు తలెత్తాయి. చేపల వ్యాపారులకు దుకాణాలు నిర్మించి ఇచ్చిన పంచాయతీ అధికారులు సంత నిర్వహణకు అనువైన ప్రాంతాన్ని చూపించలేదు. దీంతో వ్యాపారులు మరోగత్యంతరం లేక ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. సంత సమయంలో కనీసం ద్విచక్రవాహనాలు కూడా తప్పించుకునే పరిస్థితి లేకుండాపోతోంది. భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది.

సంతలో భారీ రద్దీ

మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంతకు అధిక ప్రాధాన్యత ఉంది. దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఈ సంతకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి కూరగాయలు, చేపలు, మాంసం క్రయవిక్రయాలు చేస్తుంటారు. దీంతో సంత సమయంలో భారీ రద్దీ నెలకుంటోంది. సంత ఏర్పాటు చేసే రహదారి గుండా సుమారు 30 గ్రామాల ప్రజలు, వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రత్యామ్నాయ ప్రాంతం చూపాలి



నడిరోడ్డుపై సంత నిర్వహించడం వల్ల గ్రామస్తులు, వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. ప్రజలు అవస్థలు పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. సంత నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలి.

– అయిల వీరబాబు, కోటనందూరు

బావికి తగ్గని ఆదరణ



ధర్మవరంలో తాతల నాటి బావిలో నీటిని వినియోగిస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో తరాలు మారిన తాతల నాటి బావికి మాత్రం ఎక్కడా ఆదరణ తగ్గడంలేదు. తరాలు మారాయి, మనిషి జీవనశైలి మారింది, ఆఖరికి గోదారమ్మ గట్టున ఉంటూ మినరల్ వాటర్ తాగుతున్న కాలంలో మనం ఉన్నాం. అయితే ప్రస్తుత జీవనశైలికి పూర్తి భిన్నంగా మండల కేంద్రానికి సమీపంలోని ధర్మవరంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పురాతన బావి నీటిని ఆ గ్రామస్తులు వినియోగించడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇతర తాగునీటి వనరులు ఉన్నప్పటికీ గ్రామంలో అత్యధిక శాతం ప్రజలు ఈ బావి నీటినే వినియోగిస్తున్నారు. ఈ బావి నీరు చల్లగా, రుచిగా, ఆరోగ్య కరంగాను ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

పోలీసుల ఆత్మీయ కలయిక



సమావేశంలో పాల్గొన్న డీఎస్పీ లతాకుమారి, సిబ్బంది, కుటుంబ సభ్యులు

ఏలేశ్వరం: నిత్యం ఒత్తిడితో ఉండే పోలీసులు ఆదివారం కాసేపు సేదతీరారు. డ్యూటీలో అలుపు లేకుండా పని చేసే వీరంతా పట్టణంలో కుటుంబ సభ్యులతో గడిపారు. ఎస్సై జి.సతీష్ ఆధ్వర్యంలో స్థానిక ఏలేరు ప్రాజెక్టు సమీపంలోని మణిహంస పవర్ ప్రాజెక్టు వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల టెన్త్ ఫలితాల్లో 560/600 మార్కులు సాధించిన కానిస్టేబుల్ కూరాడ దుర్గారావు కుమార్తె కుమారిని డీఎస్పీ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిత్యం డ్యూటీతో ఒత్తిడికి గురై పోలీసులు ఆత్మీయ సమావేశంతో కాస్త ఉపశమనం పొందుతారన్నారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్, సీఐ శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ తోటలకు పంపింగ్ స్కీమ్ నీరు

- రైతు కూలీ సంఘం ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నేత వీరాంజనేయులు

జగ్గంపేట: భావవరం గ్రామంలో మంచినీటి పథకం (ఫిల్టర్ బెడ్స్) నుంచి తాగునీటిని పక్కనే ఉన్న పామాయిల్ తోటలకు సరఫరా చేస్తున్నారని, ప్రజలకు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం నేతలు ఆరోపించారు. జగ్గంపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ భావవరం పంపింగ్ స్కీమ్ ద్వారా జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన 41 గ్రామాలకు తాగునీరు అందుతుందని, అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు సక్రమంగా తాగునీరు అందడంలేదన్నారు. తరచూ కరెంట్ పోతున్నా పట్టించుకునే నాథుడు లేడని, అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులు, క్లోరినేషన్ చేయకుండా కలుషిత నీరు ప్రజలకు సరఫరా చేస్తున్నారని, నిధులు మాత్రం యథావిధిగా తీసుకుంటున్నారని విమర్శించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం నేతలు పాల్గొన్నారు.

పామాయిల్ తోటలకు వెళ్లేది పనికిరాని నీరు : ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంజీ

రైతు కూలీ సంఘం నేతలు భావవరం ఫిల్టర్ బెడ్స్ నిర్వహణపై చేసిన ఆరోపణలలో ఎలాంటి వాస్తవాలు లేవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంజీ వివరణ ఇచ్చారు. ఫిల్టర్ బెడ్స్ ద్వారా ఏలేరు జలాలు శుద్ధి చేయగా రోజు వేలాది లీటర్ల వేస్టు వాటర్ వస్తుందని, వాటిని మాత్రమే పామాయిల్ తోటలకు రైతులు పెట్టుకుంటున్నారని అన్నారు. కరెంట్ పోవడం సమస్య ఉందని తెలిపారు. అయితే స్వచ్ఛమైన తాగునీరు అన్ని గ్రామాలకు అందుతోందని తెలిపారు.

వచ్చే నెల ఐదున దేవస్థానం భూముల కౌలు వేలం

కరప: స్థానిక శివాలయంలో దేవదాయశాఖకు చెందిన భూములు కౌలుకు సాగు చేసుకునేందుకు వచ్చేనెల ఐదో తేదీన ఉదయం 9 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఈఓ కె.తిరుమల రవితేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగేశ్వరస్వామివారి దేవస్థానానికి సంబంధించి 7 ప్రతులుగా ఉన్న 19.67 ఎకరాలకు, విష్ణాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వేణుగోపాలస్వామివారి దేవస్థానానికి సంబంధించి ఏడు ప్రతులుగా ఉన్న 18.74 ఎకరాలకు విడివిడిగా (ఒక్కొక్క ప్రతికి) మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు సాగుచేసుకునే నిమిత్తం వేలంపాట నిర్వహించనున్నారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు ప్రథమ ధరావతుగా చెల్లించాలన్నారు. హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరం శిస్తులో సగం సొమ్మును పాట కొట్టివేసిన వెంటనే చెల్లించాలన్నారు. పాట నిలిపివేతకు, వాయిదా వేయడానికి ఈఓకు పూర్తి అధికారం ఉందన్నారు. మిగిలిన వివరాలకు దేవస్థానం సిబ్బందిని సంప్రదించాలని ఈఓ తిరుమల రవితేజ సూచించారు.

కాట్రావులపల్లిలో రాజు యాదవ్ చిత్రం యూనిట్ సందడి



సమావేశంలో మాట్లాడుతున్న రాజుయాదవ్ చిత్ర యూనిట్ సభ్యులు

జగ్గంపేట: కాట్రావులపల్లిలో రాజు యాదవ్ చిత్రం యూనిట్ సభ్యులు ఆదివారం సందడి చేశారు. చిత్ర నిర్మాత కల్లేపల్లి రాజేష్(ఎన్ఆర్ఐ) స్వగ్రామం కాట్రావులపల్లి కావడంతో గ్రామంలో ఆయన మిత్రుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామివారికి పూజలు చేశారు. చిత్ర హీరో గెటప్ శ్రీను, హీరోయిన్ అంకిత ఖాతర్, దర్శకుడు కృష్ణమాచారి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శకుడు కృష్ణమాచారి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విడుదల అయిన రాజు యాదవ్ చిత్రాన్ని అభిమానులు ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్రంలో మొదటిసారి అవకాశం కల్పించిన నిర్మాత కల్లేపల్లి రాజేష్‌కు యూనిట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ చిత్రాన్ని జగ్గంపేట కృష్ణవేణి థియేటర్‌లో యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో పాటు వీక్షించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జీ తుమ్మలపల్లి రమేష్, థియేటర్ యజమాని తులా శ్రీను, కాట్రావులపల్లికి చెందిన కల్లేపల్లి రాజేష్ మిత్రులు, అభిమానులు పాల్గొన్నారు.

చురుగ్గా సీతారామాలయ నిర్మాణం



గోంచాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న భద్రాద్రి సీతారామాలయం

సామర్లకోట: మండల పరిధిలో గోంచాల గ్రామంలో భద్రాద్రి సీతారామాలయ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఆలయ నిర్మాణానికి పంచాయతీ తీర్మానంతో స్థలం కేటాయించారు. గోంచాల గ్రామం నుంచి ఏటా కాలినడకన సుమారు 200 మంది భక్తులు భద్రాచలం సీతారాముల విగ్రహాలు ఉంచి రథంతో వెళ్తుంటారు. దాతల సహకారంతో టేకు కర్రతో రథాన్ని నిర్మించగా దానిని పార్క్ చేయడానికి పంచాయతీ స్థలం ఇవ్వగా ఆస్థలంలో షేడ్ నిర్మించారు. అదే విధంగా ఆలయ నిర్మాణానికి అనేక మంది భక్తులు ముందుకు రావడంతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయం గర్భాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించే ప్రదేశంలో ఇసుకతో పాటు ఆలయ ప్రాంగణాన్ని ఎత్తు చేయడంతో పాటు మండపానికి శ్లాబ్ పనులు చేయాల్సి ఉన్నదని వాసుదేవ సుబ్బారావు తెలిపారు.

నూకాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



పూజలందుకుంటున్న నూకాలమ్మ తల్లి



అమ్మవారి దర్శనానికి నాలుగు క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చు ఇలవేల్పు మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. జాతర ముగిసినా వేసవి సెలవులు కావడంతో ఈ వారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్త అమవాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు కల్పించారు. సుమారు వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

గొల్లప్రోలు: గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ శీనువాసరావు హెచ్చరించారు. మండలంలోని తాటిపర్తి, కొడవలి, వన్నెపూడి గ్రామాల్లో ఆదివారం గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని అనంతరం అందరూ అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. ఎన్నికల ఫలితాల కోసం ఫలితాలు వచ్చిన తర్వాత ఎవరైనా గ్రామాల్లో తగదాలు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వేంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలాజీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల కళ్లల్లో మట్టి



కాకరాపల్లి శివారు ఇటుకబట్టీ ప్రాంతంలో రోడ్డుపై పేరుకుపోయిన బంకమట్టి

కోటనందూరు: ఇటుక బట్టీల నిర్వాహకులు ప్రయాణికుల కళ్లల్లో మట్టి కొడుతున్నారు. టీజే నగరం నుంచి కాకరాపల్లి శివారు వరకూ తుని-నర్సీపట్నం రోడ్డును ఆనుకొని 20కి పైగా ఇటుకబట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటుకల తయారీలో భాగంగా ట్రాక్టర్లు రోడ్డుపై తిరగడం వల్ల బంకమట్టి రోడ్డును అంటుకుపోతోంది. వేలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డును అంటుకున్న మట్టి ఆరిన తరువాత చెలరేగి ప్రయాణికుల కళ్లల్లో పడుతోంది. మరో పక్క ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రోడ్డుకు అంటుకున్న బంకమట్టితో జారిపడి వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కోటనందూరు మండలంలో నిర్వహిస్తున్న ఇటుకబట్టీలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ బట్టీలపై అధికారుల తనిఖీ కూడా లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుకబట్టీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు సిద్ధం



సబ్జెక్టుల వారీగా పాఠ్యపుస్తకాలు సిద్ధం చేస్తున్న సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది

గొల్లప్రోలు: పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే విద్యార్థులకు కావలిసిన పాఠ్య పుస్తకాలు సిద్ధం చేస్తున్నామని ఎంఈఓ-2 వీవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ నుంచి మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు చేబ్రోలు హైస్కూల్‌లో సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి పదో తరగతి వరకూ వివిధ సబ్జెక్టులకు సంబంధించి 24,430 పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు విడతల వారీగా వస్తున్నాయన్నారు. మండల వ్యాప్తంగా 41 ప్రభుత్వ పాఠశాలల్లో 5,800 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా నాడు-నేడు పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా దృష్టి సారించామన్నారు. సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా సాగని సాగునీరు

- ప్రధాన పంటకాలువల్లో పేరుకుపోయిన చెత్త
- ఆయకట్టుకు అందని నీరు
- నష్టపోతున్న రైతాంగం



కాలువలో పెరిగిపోయిన తుప్పలు



పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం: వేలాది ఎకరాలను సాగునీరు అందించే తిమ్మరాజుచెరువు ప్రధాన పంట కాలువల్లో చెత్త పేరుకుపోయింది. సాగునీరు సక్రమంగా సాగడంలేదు. దీంతో దిగువ ఆయకట్టుకు నీరు నీరందక రైతులు నష్టపోతున్నారు. మండల పరిధిలో ఉన్న తిమ్మరాజు చెరువు నుంచి సుమారు 6 వేల ఎకరాలను సాగునీరు అందిస్తున్నారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం, భద్రవరం, ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామాలకు చెరువు నీరు అందిస్తున్నారు. కాగా చెరువు నుంచి రెండు ప్రధాన కాలువల ద్వారా సాగునీరు పొలాలకు వెళుతోంది. చెరువు నీరు అందించే కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, ఆక్రమణలకు గురికావడంతో సాగునీరు అందక పంటలు నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలువలపై కట్టడాలు నిర్మించడంతోపాటు చెత్తను కాలువలోనే పారబోస్తున్నారని, చర్యలు తీసుకోవాలని రైతులు అనేక సార్లు ఆందోళనలు చేశారు. సిరిపురంలో సుమారు వెయ్యి ఎకరాలను సాగునీరు అందడం లేదు. దీనిపై రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా అధికారులు స్పందించడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తూతూమంత్రంగా పూడికతీత పనులు

గతంలో ప్రధాన కాలువ పూడిక పనులు తూతూమంత్రంగా చేశారని విమర్శలు వస్తున్నాయి. కాలువలో తీసిన పూడికను నెలల తరబడి అక్కడే వదిలివేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో పట్టణంలోని ప్రధానకాలువలో పూడిక తీసి వదిలివేయడంతో అదే కాలువలో పడిపోయిందని అప్పట్లో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలువపై ఉన్న ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో పూడికతొలగింపు పనులు నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సాయం చేయబోతే సెల్ చోరీ

సామర్లకోట: రోడ్డుపై పడిపోయి ఉన్న వ్యక్తికి చెయ్యి ఇచ్చి లేపడానికి ప్రయత్నం చేసే సమయంలో వెనుక నుంచి మరో వ్యక్తి చొక్కా జేబులోని సెల్‌ఫోన్‌ను చోరీ చేసి ఉడాయించాడు. స్థానిక సత్యనారాయణపురంలో నివసిస్తున్న ఆర్ఎంపీ డాక్టరు ఇనకోట సురేష్ తన ఇంటి సమీపంలో అనారోగ్యానికి గురైన వ్యక్తికి వైద్య పరీక్షలు చేసి మోటారు సైకిలుపై శనివారం రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై పడిపోయి ఉన్న ఒక గుర్తు తెలియని వ్యక్తి చెయ్యివ్వమని సైగ చేయడంతో మోటారు సైకిలు నుంచి సురేష్ చెయ్యి అందించి లేపే ప్రయత్నంలో ఉండగా వెనుక మోటారు సైకిలుపై ఉన్న మరో వ్యక్తి డాక్టర్ జేబులోని సెల్‌ఫోన్‌ను లాఘవంగా చేజిక్కించుకోవడం, పడిపోయిన వ్యక్తి సైతం మోటారు సైకిల్ ఎక్కి పరారవడం క్షణాల్లో జరిగిపోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.